నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

బండ్లగూడ, ఆగస్టు 2: విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 నుంచి 11.30గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. గంధంగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరకాలనీ, డైమండ్‌వ్యాలీ, ప్రశాంత్ నగర్, తిరుమల గార్డెన్, రాధారి యాల్టీ, పవని హర్మొని విల్లాస్, పద్మ శ్రీహిల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నేహితహిల్స్ కాలనీ, 12 నుంచి 12.30 గంటల వరకు మఫిల్‌టౌన్, విశ్వాస్‌టౌన్, 12.30 గంటల నుంచి ఒంటి గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, ఏ,బీ,సీ,డీ బ్లాక్స్, స్పెషల్‌బ్లాక్, సన్‌సిటీ, కీర్తి రిచ్‌మౌండ్ విల్లాస్, బైరాగిగూడ, శివపురి, శివసాయినగర్ ఫేస్-1, 2. సుబ్రమణ్యకాలనీ, వాల్మీకినగర్, సన్‌గాంసిటీ, గంధంగూడ, ఇండస్‌వ్యాలీ, సాయి బాలజీనగర్, సంజయ్‌గాంధీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

గొల్లపల్లి ఫీడర్ పరిధిలో..

శంషాబాద్ రూరల్: నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శంషాబాద్ విద్యుత్‌శాఖ ఏఈ షేక్ బాషా తెలిపారు. శంషాబాద్ మండలంలోని గొల్లపల్లి 11 కేవీ ఫీడర్‌లో మరమతుల కోసం ఉదయం 11 నుంచి 11.45గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు. దీంతో పాటు చిన్నగోల్కొండ ఫీడర్ 11కేవీ 12 నుంచి 12.45 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. దీంతో మండలంలోని హమిదుల్లానగర్, రషీద్‌గూడ, పోశెట్టిగూడ, పెద్ద గోల్కొండ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు మొక్కల పంపిణీ

మణికొండ: నేడు అల్కాపూర్ టౌన్‌షిప్ స్వామి వివేకానంద పార్కులో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మణికొండ మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ ఆలస్యం నవీన్‌కుమార్ తెలిపారు.

వర్గీకరణతో అట్టడుగు వర్గాలకు మేలు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణతో అట్టడుగు వర్గాలకు మేలు జరుగుతుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరక్టర్ బుర్కుంట సతీశ్ తెలిపారు. వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుమతివ్వడంతో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు శంషాబాద్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎస్సీ, ఎస్టీ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. వర్గీకరణ కోసం 30 ఏండ్లుగా పోరాటం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, కొన్నమొల్ల శ్రీనివాస్, చిన్నగండు రాజేందర్, జగ్గయ్య, రమేశ్, చరణ్, పరంధాములు, మదిలేటి, చిట్టిబాబు, రత్నం, రమేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

బండ్లగూడ: ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీగా వర్గీకరించుకోవచ్చని దేశ అత్యున్నత న్యాయస్థానం రాష్ట్రాలకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై మాదిగ, మాదిగ ఉపకులాల జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం రాజేంద్రనగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు భీమయ్య, పి.వెంకటేశ్, బాలసుబ్రహ్మణ్యం, వెంకటేశ్, నర్సింహ, అంజిబాబు, శ్రీకాంత్, రవి, రాజు, రామకృష్ణ, బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తున్న రాజేంద్రనగర్ జర్నలిస్టులు

సచివాలయ ముట్టడికి తరలిరండి

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

హిమాయత్‌నగర్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఈనెల 29న జరిగే రాష్ట్ర సచివాలయ ముట్టడికి మాలలు తరలి రావాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్‌రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అమలు చేసేందుకు ఆర్డినెన్స్ తీసుకువస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. మాలల ఓట్లతోనే గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రజా ప్రతినిధుల ఇండ్లను, ఆఫీస్‌లను ముట్టడించి నిరసన చేయాలని మాలలకు పిలుపునిచ్చారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జేఎన్ రావు, జాతీయ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ భాస్కర్, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సిలివేరి వసంతరావు, గ్రేటర్ అధ్యక్షుడు చిప్పర్తి సుబ్బారావు, నాయకులు జయరాజు, బత్తుల సత్యనారాయణ, మహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరం

బాబుల్‌రెడ్డినగర్ తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 2: బిడ్డలకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని అంగన్‌వాడీ టీచర్లు కనకవ్వ, అనిత అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి సెక్టార్ బాబుల్‌రెడ్డినగర్, వినాయక్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలన్నారు. ఈ పాలు బిడ్డకు తొలి ఆహారం, బిడ్డ ఆరోగ్యంగా ఎదగడానికి తల్లిపాలె ముఖ్యమన్నారు. ఈ విషయంలో చాలా మంది తల్లులు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఫలితంగా పిల్లలు రక్తహీనత, వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. ప్రస్తుత సమాజంలో చాలా మంది బిడ్డకు పాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు మహిళలు శారీరక సౌందర్యం తగ్గుతుందనే అపోహతో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ గౌరీ, ఏఎన్‌ఎం ప్రేమాదేవి, భాగ్య, ఆశావర్కర్లు సరిత, రేణుక, మంగ తదితరులు పాల్గొన్నారు.

మురుగు నివారణకు తక్షణ చర్యలు

వెంకటేశ్వరకాలనీలో డ్రైనేజీ పనులను పర్యవేక్షిస్తున్న డీజీఎం వి.రేణుక

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 2: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వెంకటేశ్వరకాలనీలో పొంగిపొర్లుతున్న మురుగు సమస్య నివారణకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు హైదరాబాద్ మెట్రో వాటర్ అండ్ సీవరేజీ బోర్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.రేణుక తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి సెక్షన్ మేనేజర్ సయ్యద్ సాజీద్ అలీ సమస్యను డీజీఎం దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించి ఆమె వెంకటేశ్వరకాలనీలో పర్యటించారు. యుద్ధప్రాతిపదికన మ్యాన్‌హోల్స్ మరమ్మతు పనులను చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యర్థాలను డ్రైనేజీలో వేయొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ చంద్రయ్యతో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ జియావుద్దీన్, సూపర్‌వైజర్ వినోద్, స్థానికులు పాల్గొన్నారు.

ప్రమోషన్ రాలేదని మనస్తాపంలో ఆత్మహత్య

వెంగళరావునగర్, ఆగస్టు 2: ప్రమోషన్ దక్కడంలేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా రొంపిచెర్ల మండలం, విప్పార్ల గ్రామానికి చెందిన ఆవుల అప్పారావు కుమారుడు ఆవుల మస్తాన్‌రావు(24)నగరంలోని ఓ కాల్‌సెంటర్‌లో పని చేస్తూ ఎస్ఆర్‌నగర్‌లోని బాయిస్ హాస్టల్‌లో ఉంటున్నాడు. తాను పనిచేస్తున్న సంస్థలో ప్రమోషన్ కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. దీంతో మనస్తాపం చెంది గత నెల 31న విషం తాగి అపస్మారకస్థితికి చేరాడు. గదిలో సహచరులు గుర్తించి అమీర్‌పేటలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో గ్రానైట్ ఫ్లోరింగ్ చేయించిన భక్తుడు



రవియాదవ్‌ను సన్మానించిన ఆలయ కమిటీ ప్రతినిధులు

ఎర్రగడ్డ, ఆగస్టు 2: బోరబండకు చెందిన రవియాదవ్ అనే భక్తుడు స్థానిక బస్ టెర్మినల్‌లోని పోచమ్మ ఆలయ గర్భగుడిలో పాటు ఆవరణలో గ్రానైట్ ఫ్లోరింగ్ పనులను తన సొంత ఖర్చుతో పూర్తి చేశారు. కాగా దాత రవియాదవ్‌ను శుక్రవారం ఆలయానికి ఆహ్వానించి సన్మానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.రవీందర్, బస్తీ అధ్యక్షుడు ఆనంద్, జి.లక్ష్మణ్‌గౌడ్, పి.శంకర్, ప్రవీణ్ గౌడ్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి జాక్‌పాట్ ముఖ్యమంత్రి

బండ్లగూడ, ఆగస్టు 2: రేవంత్‌రెడ్డి జాక్‌పాట్ ముఖ్యమంత్రి అని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి అన్నారు. శాసనసభలో సీఎం చేసిన వ్యాఖ్యాలను ఆయన ఖండించారు. ఎమ్మెల్యే సబితారెడ్డికి క్షమాపనలు చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

పరిసరాల పరిశుభ్రతే రక్ష

మణికొండ, జూలై 2: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ సూచించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 5, 6, 18వ వార్డుల్లో డెంగ్యూ దోమల నివారణపై డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ఈఈ సంపత్, శానిటేషన్ సూపర్‌వైజర్లు, టీఎంసీ ఆర్పీలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛదనంపై సమీక్ష

జూబ్లీహిల్స్, ఆగస్టు 2: ప్రభుత్వం చేపట్టనున్న స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 19వ సర్కిల్ డీసీ సేవాఇస్లావత్ అన్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏఎంసీలు కమల్, బాల్‌రాజ్, డిప్యూటీ ఈఈ శ్రీరాములు, ఏఎంఓహెచ్ కవిత, ఎస్ఎస్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

117 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 2: అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న కేంద్రంలో పౌర సరఫరాల శాఖ అధికారులు దాడులు చేశారు. మైలార్‌దేవ్‌పల్లిలోని ఓ గోదామ్‌లో సర్జిత్ డొమెస్టిక్ సిలిండర్లను తీసుకొని వాటిని కమర్షియల్ సిలిండర్లలో నింపుతూ సొమ్ము చేసుకుంటున్నాడు. శుక్రవారం గోదాంపై అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి బాలసరోజ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఫిల్లింగ్ చేస్తున్న 117 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు.

డెంగ్యూ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జూబ్లీహిల్స్, ఆగస్టు 2: డెంగ్యూ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. గురువారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె.వెంకటి, జీహెచ్ఎంసీ చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబుతో కలిసి బంజారాహిల్స్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఇటీవల నమోదైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. బంజారాహిల్స్‌లోని బస్తీల్లో పర్యటించి ఇటీవల ఎన్‌బీటీనగర్‌లో డెంగ్యూ పాజిటివ్ వచ్చిన కేసు రికవరీపై వివరాలు తెలుసుకున్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంటమాలజీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో బస్తీవాసులకు సూచనలు చేశారు. ఫీవర్ సర్వే పకడ్బందీగా చేపట్టాలని, తద్వారా డెంగ్యూ కేసులను ఎప్పటికప్పుడు గుర్తించాలని ఆశా వర్కర్లకు సూచించారు.

ఆర్టీసీ సేవలను విస్తరించాలి

ఎర్రగడ్డ, ఆగస్టు 2: పెరిగిన జనాభాకు అనుగుణంగా టీజీఎస్ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని సీపీఎం నేతలు అన్నారు. బోరబండ బస్ టెర్మినల్‌లో శుక్రవారం ప్రయాణికుల నుంచి సంతకాలను సేకరించారు. సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ నాయకుడు సాయిశేషగిరిరావు మాట్లాడుతూ.. 45ఎఫ్ రూటు బస్సులను పునరుద్ధరించాలన్నారు. అధికారులు వెంటనే స్పందించని పక్షంలో ఈనెల 8న బస్ భవన్ వద్ద ధర్నాకు దిగుతామని సాయిశేషగిరిరావు హెచ్చరించారు.

బీజేఆర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా విజయ్‌కుమార్

హిమాయత్‌నగర్, ఆగస్టు 2: నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌రాం (బీజేఆర్) ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా విజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉన్న ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యత పెంపొందించి మెరుగైన ఉపాధి అవకాశాలు లభించేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

కత్తితో తిరుగుతున్న ఇద్దరు అరెస్ట్

వెంగళరావునగర్, ఆగస్టు 2: ఫలహారం బండి ఊరేగింపులో పొడవాటి కత్తితో అనుమానాస్పతంగా తిరుగుతున్న ఇద్దరిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గురువారం బల్కంపేటలోని ప్రశాంత్‌కాలనీ నుంచి పలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్ఆర్‌నగర్‌లోని వెంకటేశ్వర ఆలయం వద్దకు అనుమానాస్పదంగా ఇద్దరు యువకులు కనిపించారు. బందోబస్తులో ఉన్న పోలీసులు తనిఖీలు చేయగా బేగంపేట, మయూరిమార్గ్‌కు చెందిన భీమ్‌సింగ్ సురేశ్(19), బీజేఆర్‌నగర్‌కు చెందిన రామేశ్వరం రామ్(20)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భీమ్‌సింగ్ సురేశ్ వద్ద 9.5 అంగుళాల పొడవున్న డాగర్ (కత్తి) లభ్యమైంది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆభరణాలు మాయం

వెంగళరావునగర్, ఆగస్టు 2: బీరువాలో దాచిన 80 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన ఎన్.శ్రీనివాసులు బీకేగూడలోని స్నేహ చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. నాలుగేండ్లుగా సంపాదించిన పైకంతో 80 గ్రాముల బంగారు ఆభరణాలు కొని బీరువాలో దాచాడు. ఈనెల 1న శ్రీనివాసులు భార్య బీరువాలో చూడగా బాక్సులు ఉన్నప్పటికీ నగలు కనిపించలేదు. దీంతో బాధితులు ఎస్ఆర్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరించి డబ్బులు వసూలు

వెంగళరావునగర్, ఆగస్టు 2: సినిమాకు వెళ్లి నడుచుకుంటూ వస్తున్న ఐదుగురు యువకులను బెదిరించి దోపిడీకి పాల్పడిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన ఎల్.పవన్(21)ఎస్ఆర్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ పంజాగుట్టలోని పీవీఆర్ సినిమాలో ఈఎస్‌పీగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి పవన్ మిత్రులు రాజేశ్, రాకేశ్, భరత్, వంశీలతో కలిసి పీవీఆర్‌లో సినిమా చూసి అర్ధరాత్రి 2.30కు ఎస్ఆర్‌నగర్ నుంచి ఈస్ట్ శ్రీనివాస్‌నగర్ మీదుగా హాస్టల్‌కు నడుచుకుంటూ వస్తున్నారు. నలుగురు గుర్తుతెలియని యువకులు వీరిని అడ్డగించారు. తీవ్రంగా కొట్టి వీరి వీడియోలను తీశారు. ఈ సమయంలో ఎక్కడ నుంచి వస్తున్నారని మిమ్మల్ని పోలీసులకు పట్టిస్తామని బెదిరించారు. తమకు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భయపడిని పవన్ అతని మిత్రులు వారు చెప్పిన విధంగా రూ.మూడువేలు ఫోన్‌పే చేసి వెళ్తుండగా ఆగంతకులు మళ్లీ వెంబడించారు. కొద్ది దూరంలో మళ్లీ వారిని ఆపి వారి ముందు కత్తి పెట్టి వీడియో తీశారు. మళ్లీ డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. చేసేది లేక బాధిత యువకులు రూ.7 వేలు ఫోన్ పే చేసి హాస్టల్‌కు చేరుకున్నారు. శుక్రవారం హాస్టల్ నిర్వాహకుడికి విషయం చెప్పి ఎస్ఆర్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

టీఎన్‌జీవోస్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 2: ప్రజా సమస్యల పరిష్కారానికి బస్తీలు, కాలనీల్లో పాదయాత్రలు చేస్తున్నట్లు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని హౌసింగ్‌బోర్డుకాలనీ, దుర్గానగర్, టీఎన్‌జీవోస్‌కాలనీల్లో శుక్రవారం జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో భార్గవ్, బబ్లూ, నర్సింహ, పృథ్వీరాజ్, తలారి చిన్న, మధుసూదన్‌రెడ్డి, వెంకటరమణ, నాగభూషణం, రమేశ్, వీరేశ్, మధు, ప్రత్యూశ్, రాజుకుమార్, మల్లికార్జున్, జలమండలి మేనేజర్ సాధిక్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ జియా, ఎం.వినయ్‌కుమార్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, హరీశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో సత్తాచాటిన భానుసాగర్

భానుసాగర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 2: లక్ష్య సాధనకు కష్టపడాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఇటీవల గోవాలో జరిగిన సీనియర్ అండ్ మాస్టర్స్ కేటగిరి నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కాటేదాన్‌కు చెందిన భానుసాగర్ కాంస్య పతకాన్ని సాధించారు. కోచ్ నర్సింగ్‌రావుతో కలిసి భానుసాగర్‌ను ఎమ్మెల్యే సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఎం.మహిపాల్, రంగారెడ్డి జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, కోచ్ నర్సింగ్‌రావు, శ్రీరామ్, రామాంజనేయులు, జీవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేసిన ఎమ్మెల్యే

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మున్సిపాలిటీ కొత్వాల్‌గూడకు చెందిన జనని అనారోగ్యానికి గురయ్యింది. డబ్బులు లేకపోవడంతో ఎల్వోసీకి దరఖాస్తు చేసుకున్నారు. రూ.లక్ష మంజూరు కావడంతో శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మహిళకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, కృష్ణముదిరాజ్, సిద్ధేశ్వర్‌గౌడ్, గుంటి బాలయ్య, అశోక్‌ముదిరాజ్, అంజిముదిరాజ్, వెంకటరమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేబీఆర్ పార్క్‌లో రాక్ లైటింగ్





జూబ్లీహిల్స్, ఆగస్టు 2: సందర్శకులను ఆకర్షించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కేబీఆర్ నేషనల్ పార్క్‌లో ఫౌంటెన్‌కు రాక్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం గేట్ నంబర్-5 దగ్గర ఏర్పాటు చేసిన రాక్ ఫౌంటేన్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో ఖైతరాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, విద్యుత్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

వివిధ లా కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల రెగ్యులర్ పరీక్షలతో పాటు వన్‌టైం చాన్స్ పరీక్షలు, ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలతో పాటు వన్‌టైం చాన్స్ పరీక్షలను ఈ నెల 16నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac. inలో చూసుకోవచ్చని సూచించారు.

రీవాల్యూయేషన్ దరఖాస్తులు

బీఫార్మసీ పరీక్ష ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ.రాములు తెలిపారు. బీఫార్మసీ 8వ సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత తీసుకోవాలన్నారు. రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈనెల 8లోగా ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 10వరకు చేయొచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 8లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నకలు పొందేందుకు..

పీజీ కోర్సుల ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ.రాములు తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజే అండ్ఎంసీ, ఎంకామ్ (ఐఎస్) తదితర కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు మార్కు మెమోలను మూడు వారాల తరువాత సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.10వేల చొప్పున చెల్లించి వచ్చే నెల 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.